క్లుప్తంగా

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ప్రకాష్‌నగర్, లోధా, సంజీవయ్య పార్కు, ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎరుకల బస్తీ, మెజిస్టిక్ మాన్షన్, జాగృతి అపార్ట్‌మెంట్, ఆర్‌బీఐ లైన్, సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ ఏరియా, అల్లావుద్దీన్ కోఠి, లిక్కర్ కంపెనీ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జీఈ బిల్డింగ్, వెర్మాంట్ అపార్ట్‌మెంట్స్, ఎర్రగడ్డ మెయిన్‌రోడ్డు, ఎఫ్‌సీఐ గోడౌన్ ఏరియా, ప్రేమ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్ల వంకాయ 28, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 43, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరిబీర 45, క్యాబేజీ 10, క్యారెట్ 17, దొండ 35, గుండుబీన్స్ 28, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 25, దోసకాయ 23, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 31, చామగడ్డ 50, మొరంగడ్డ 18, కందగడ్డ 23, సొరకాయ 15, పొట్లకాయ 13, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు ఉంటాయి.

రక్తదాన శిబిరం



బీజేవైఎం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: తలసేమియా రోగుల సహాయార్థం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు బీజేపీ సీనియర్ నాయకులు మంద సురేష్ తెలిపారు. బీజేవైఎం జాతీయ ట్రెజరర్ సాయి ప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకొని అడ్డగుట్టలోని యాభై పడకల ఆస్పత్రి సమీపంలో మంద సురేష్ నేతృత్వంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 100 మంది రక్తదానం చేశారు. వీరికి సికిల్ సెల్ సొసైటీ ఫర్ తలసేమియా వారు ప్రశంసా పత్రాలను అందజేశారు. అంతకు ముందు మహేంద్రాహిల్స్‌లోని విద్యా విహార్‌లోని 50 మంది మెంటలీ చాలెంజ్డ్ పిల్లలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. బీజేపీ నేతలు శ్యామ్, నరేందర్, మహేష్‌గౌడ్, బీజేవైఎం నాయకులు ఉదయ్ యాదవ్, శివాజీ, నరేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగపూర్ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌కు ఓయూ ప్రొఫెసర్



అవార్డును అందుకుంటున్న ప్రొ.మాధవి

ఉస్మానియా యూనివర్సిటీ: నాగపూర్‌లో జరుగుతున్న జాతీయ 108వ సైన్స్ కాంగ్రెస్‌కు ఓయూ జంతుశాస్త్రం విభాగం చైర్‌పర్సన్ ప్రొ.మాధవి పాల్గొన్నారు. ఈ నెల 3 నుంచి 7 వరకు నాగపూర్‌లోని ఆర్.టి.ఎం యూనివర్సిటీలో జరిగే జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో తన ఇన్నొవేటివ్ పరిశోధనకు, అద్భుతమైన పరిశోధన పత్రాల సమర్పణకు అభినందనలు తెలుపుతూ జ్ఞాపికను అందచేశారు.

ఆయుర్వేదంతో ఉత్తమ చికిత్స

సాక్షి, సిటీబ్యూరో: శారీరక నొప్పులకు ఆయుర్వేదంలో అత్యున్నత పరిష్కార మార్గాలు ఉన్నాయని ప్రముఖ వైద్య ఉత్పత్తుల సంస్థ దక్కన్ హెల్త్‌కేర్ ప్రతినిధులు తెలిపారు. నగరంలో తమ సేవలు ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ ఆయుర్వేద విజ్ఞానం, సమకాలీన శాస్త్రీయ పరిశోధనలను సరైన విధంగా మేళవిస్తే అద్భుతమైన ఫలితాలను అందిస్తాయనడానికి . నొప్పులు, కండరాలు పట్టే సమస్యల నివారణకు ఉపకరిస్తున్న ఆయుర్వేదిక్ జెల్ క్విట్ పెయిన్ లాంటి ఉత్పత్తులు నిదర్శనమన్నారు.

ఓయూ ఇంజినీరింగ్ తప్పిన విద్యార్థులకు వన్‌టైం ఛాన్స్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో వివిధ ఇంజినీరింగ్ కోర్సుల్లో తప్పిన విద్యార్థులు పరీక్షలు రాసుకునేందుకు వన్‌టైం ఛాన్స్ ఇచ్చారు. బీఈ (నాన్ సీబీసీఎస్) 2000–2001 నుంచి 2012–2013 వరకు మొదటి సంవత్సరం విద్యార్థులతో పాటు రెండోసంవత్సరం నేరుగా ప్రవేశం పొందిన 2001–02 నుంచి 2013–14 విద్యార్థులు వన్‌టైం ఛాన్స్ పరీక్షకు అర్హత గల విద్యార్థులు ఈ నెల 9 వరకు, రూ.200 అపరాధ రుసుముతో 11వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని అధికారులు తెలిపారు. పూర్తి వివరాలను ఉస్మానియా.ఏసీ.ఇన్ వెబ్‌సైట్లో చూడవచ్చు.

ప్రజా సంక్షేమమే ప్రథమ ఎజెండా



బేగంపేట దేవిడి బస్తీలో సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: తాను నిరంతరం సనత్‌నగర్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసమే తపిస్తానని, వారికి సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా వెనువెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్‌లోని దేవిడి బస్తీలో శుక్రవారం ఆయన అధికారులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేయగా, ఎయిర్‌టెక్ మిషన్‌ను తెప్పించి సీవరేజ్ లైన్ క్లీనింగ్‌కు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రోడ్లను నిర్మించాలని కోరగా, వెంటనే ప్రతిపాదనలు అందజేయాలని జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కాలనీ ప్రజల అవసరాల కోసం నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.40 లక్షలను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారందరికీ పెన్షన్లు అందించేందుకు దేవిడిలో మూడు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తహసీల్దార్ అహల్యను మంత్రి ఆదేశించారు. తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. మంత్రి వెంట కార్పొరేటర్ మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ ఉప్పల తరుణి, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీ ముకుందరెడ్డి, ఈఈ సుదర్శన్, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, వాటర్‌వర్క్స్ డీజీఎం శశాంక్, స్ట్రీట్ లైట్ అధికారి సాగర్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి, నరేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌ముదిరాజ్, కాలనీ అధ్యక్షుడు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కొలువుల జాతర : డిప్యూటీ మేయర్

లాలాపేట: తెలంగాణ ప్రభుత్వం టిఎస్‌పిఎస్సీ ద్వారా విడుదల చేస్తున్న వివిధ ఉద్యోగాల నోటిఫికేషన్లతో రాష్ట్రంలో కొలువుల జాతర వచ్చిందని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం లాలాపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో పోలీసు రిక్రూట్‌మెంట్‌లో ఫిజికల్ ఈవెంట్స్‌లో విజయవంతంగా పూర్తి చేసి తుది రాత పరీక్షకు అర్హత సాదించిన పలువురిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తార్నాక డివిజన్ లాలాపేటలోని ప్రొ జయశంకర్ స్టేడియంలో సాధన చేసి పోలీసు ఉద్యోగాల ఫిజికల్ ఈవెంట్స్‌లో అర్హత సాధించడం ఎంతో గర్వకారణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో భర్తీ చేస్తున్న వివిధ ఉద్యోగాల నోటిఫికేషన్లను అర్హతగల నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలనీ ఆకాంక్షించారు. ప్రధానంగా పోలీసు శాఖలో ఉద్యోగాలు సాధించి ప్రజలకు మరింత సేవ చేయాలనీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి తదితరులున్నారు.

విద్యార్థినులతో రీసెర్చ్ స్కాలర్ వికృత చేష్టలు

చిలకలగూడ : ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీల పట్ల ఓ రీసెర్చ్ స్కాలర్ వికృత చేష్టలు, లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాల యాజమాన్యం సదరు రీసెర్చ్ స్కాలర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసి, కొంత సమయం తర్వాత వాపస్ తీసుకున్నట్లు తెలిసింది. విద్యార్థినుల తల్లితండ్రులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు.. ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న వ్యక్తి వారం క్రితం రీసెర్చ్ చేసేందుకు సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాల నుంచి అనుమతి పొందాడు. గత నెలలో కొద్ది రోజులు తరగతులకు వెల్లాడు. విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో విద్యార్థినులు ప్రధానోపాధ్యాయుడు, ఇతర టీచర్లకు తెలిపారు. హెచ్‌ఎం చిలకలగూడ ఠాణాలో ఫిర్యాదు చేసి కొంత సమయం తర్వాత వాపసు తీసుకున్నాడు. ఈ విషయాన్ని ఠాణా సీఐ నరేష్ ధృవీకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి వివరణ కోరగా.. రిసెర్చ్ స్కాలర్ అసభ్యంగా ప్రవర్తించిన మాటవాస్తమేనని, స్కూలుతోపాటు విద్యార్థినిల పరువు పోతుందనే ఉద్దేశ్యంతో ఫిర్యాదు వాపసు తీసుకున్నామన్నారు.

బన్సీలాల్‌పేట్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పర్యటన



శంకర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి శుక్రవారం బన్సీలాల్‌పేట్‌లో పర్యటించారు. డివిజన్‌లోని బీజేఆర్ నగర్ బస్తీలో ఉన్న బీజేపీ నాయకుడు కుర్మ శంకర్ నివాసానికి వెళ్లారు. ఇటీవల కుర్మ శంకర్ తల్లి లింగమ్మ మరణించారు. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శంకర్ కుటుంబాన్ని పరామర్శించి లింగమ్మ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు టి. రాజశేఖర్‌రెడ్డి, శ్యాంసుందర్ గౌడ్, ఆనంద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దున్నపోతుకు వినతిపత్రం



దున్నపోతుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న పోలీసు ఉద్యోగాల అభ్యర్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: పోలీసు ఉద్యోగాల అభ్యర్థులు దున్నపోతుకు వినతి పత్రం సమర్పించి వినూత్న నిరసన చేపట్టారు. శుక్రవారం వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. తమ సమస్యలను పరిష్కారించాలని పోరాడుతున్న ప్రభుత్వం పట్టించుకోకుండా దున్నపోతుపై వర్షం కురిసిన చందంగా వ్యవహరిస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు సలీంపాషా, ఖాదర్‌వలీతో పాటు ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

డీఐజీ సుమతికి శుభాకాంక్షలు



డీఐజీ సుమతిని కలిసిన రుద్రవీణ మహిళ సంఘం సభ్యులు

అడ్డగుట్ట: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మహిళా భద్రత విభాగం డీఐజీ సుమతిని అడ్డగుట్టకు చెందిన రుద్రవీణ మహిళ సంఘం అధ్యక్షురాలు ఎన్. శోభ, ప్రధాన కార్యదర్శి గంధమాల జ్యోతిప్రభా రెడ్డిలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఐజీ సుమతికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈఎస్‌ఐసీ పారామెడికల్ నూతన కార్యవర్గం



ప్రధాన కార్యదర్శి శీను

అమీర్‌పేట : సనత్‌నగర్ ఈఎస్‌ఐసీ మెడికల్ కళాశాల బోధన,సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి పారామెడికల్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా శీను కల్లూరి నియమితులయ్యారు. బిఎంఎస్ యూనియన్ రాష్ట్ర నాయకులు పాపిరెడ్డి,రాము,ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులను ప్రకటించారు.

ఉన్నత ప్రమాణాలతో పరిశోధనలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అత్యుతన్న ప్రమాణాలతో కూడిన పరిశోధనల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వీసీ ప్రొ.రవిందర్ పేర్కొన్నారు. శుక్రవారం యూనివర్సిటీ క్యాంపస్ సైన్స్ కాలేజీలోని జియోఫిజిక్స్ విభాగంలో గ్లోబల్ అలుమ్నీ మీట్–2023 జరిగింది. కార్యక్రమానికి సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్, జియోఫిజిక్స్ విభాగం హెడ్ ప్రొ.వీరయ్య అధ్యక్షత వహించగా వీసీ ప్రొ.రవిందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం పూర్వవిద్యార్థుల సహకారంతో పునఃనిర్మించిన సెమినార్ హాలుకు జియోఫిజిక్స్ విభాగం వ్యవస్థాపకులు ప్రొ.వీఎల్‌ఎస్ భీమశంకరం (దివంగత అధ్యాపకులు) నామాకరణం చేసి ఆయన చిత్రపటాన్ని అవిష్కరించారు. పూర్వవిద్యార్థి ఎస్. చంద్రబాబు అందచేసిన రూ.60 లక్షల విరాళం నుంచి ప్రతి నెలా మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందచేయనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య వివరించారు. కార్యక్రమంలో ఎంజీఆర్‌ఐ మాజీ డైరెక్టర్ డాక్టర్.హెచ్‌కే గుప్త, ఏఎండీ డైరెక్టర్ డాక్టర్.బి శరవణన్, ప్రొ.మురళి పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించిప్పడే సమాజాభివృద్ధి



అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

సనత్‌నగర్: విద్యార్థి దశలోనే విలువలతో కూడిన విద్యనందించినప్పుడే సమాజాభివృద్ధికి అంకితభావంతో సేవలు అందించగలుగుతారని సెంట్రల్ యూనివర్శిటీ రీసెర్చ్ డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ సామ్రాట్ ఎల్. సబట్ ఉపాధ్యాయులకు సూచించారు. సికింద్రాబాద్ హరిహర కళా భవన్‌లో శుక్రవారం సాయంత్రం సదాశివ హైస్కూల్ ఓల్డ్ బోయిన్‌పల్లి, ఫిరోజ్‌గూడ బ్రాంచ్‌ల వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. విశిష్ట అతిథిగా హాజరైన ప్రొఫెసర్ సబట్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే చిన్నారుల్లో సంస్కృతీ సంప్రదాయాల విలువలను, దేశభక్తి భావాలను పెంపొందించాలన్నారు. విద్యా సంస్థల నిర్వహించడమంటే మంచి సమాజం నిర్మించడమేనన్నారు. సదాశివ హైస్కూల్ గ్రూప్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఎస్.శివరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

నేడు బీజేపీ బూత్ కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చిలకలగూడ : సికింద్రాబాద్ నియోజకవర్గ బూత్ కమిటీ సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు సీతాఫల్‌మండి డివిజన్ బీదలబస్తీ మైదానంలో నిర్వహించనున్నట్లు మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తెలిపారు. ఈమేరకు శుక్రవారం రాత్రి సమావేశపు ఏర్పాట్లను పరిశీలించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు బూత్ కమిటీ సమావేశంలో వర్చువల్ పద్ధతిలో అధినాయకత్వంతో మాట్లాడేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టామన్నారు. బీజేపీ అధినాయకులు జేపీ నడ్డా, తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్ తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల సారంగపాణి, రాచమల్ల కృష్ణమూర్తి, హరి, ప్రభుగుప్తా, నాగేశ్వరరెడ్డి, భాస్కర్‌గిరి పాల్గొన్నారు.

'క్వీన్స్'లో సంక్రాంతి సంబురాలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల మాతృమూర్తులు



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థులు, వారి మాతృమూర్తులు రంగురంగుల ముగ్గులు, ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. శ్రీనగర్‌కాలనీలోని క్వీన్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం సంక్రాంతి సంబురాలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల మాతృమూర్తులు ముగ్గుల పోటీల్లో సరదాగా పాల్గొని వారి ప్రతిభను చాటారు. విద్యార్థులు ముగ్గులతో పాటు, పలు పోటీల్లో సందడిగా పాల్గొని ఆటపాటలతో సంక్రాంతి శోభను ముందుగానే తీసుకొచ్చారు. ఈ వేడుకలకు శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయ ఈఓ లావణ్య హాజరై పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల మాతృమూర్తులకు, విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. వేడుకల్లో స్కూల్ చైర్మన్ రామలింగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓయూలో 1500 మంది పీహెచ్‌డీలు రద్దు

● 10న బాధిత విద్యార్థుల సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 1500 మంది విద్యార్థుల పీహెచ్‌డీ అడ్మిషన్లను అధికారులు రద్దు చేశారు. శుక్రవారం ఓయూలో సమావేశమైన బాధిత విద్యార్థులు దశలవారీ ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. యూజీసీ నిబంధనల ప్రకారం ప్రీ–పీహెచ్‌డీ ఉత్తీర్ణులైన విద్యార్థులు పరిశోధనలను ఎప్పుడైనా పూర్తి చేయవచ్చు. కానీ యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఓయూ వీసీ ప్రొ.రవీందర్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర పేద వర్గాలకు చెందిన 1500 పీహెచ్‌డీలను రద్దు చేసి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. వీసీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 10న సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. సమావేశానికి వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, వివిధ వర్సిటీలకు చెందిన సీనియర్ ప్రొఫెసర్లు, రాజకీయ పార్టీల నేతలు, ఉన్నత విద్యావంతులు హాజరవుతారన్నారు.

కేలెండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రబోస్

లాలాపేట: సియోరా గ్రూప్ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2023 కేలండర్, డైరీని శుక్రవారం సినీ గేయ రచయిత చంద్రబోస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులకు, వినియోగదారులకు చంద్రబోస్ నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. గత ఆరు సంవత్సరాల నుంచి సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ సంతోష్‌రెడ్డి, దర్శకుడు అమరేందర్, సంస్థ డైరెక్టర్లు డా. కిరణ్‌కుమార్, డా. శివారెడ్డి, సతీష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేత అక్బర్ మృతి



అక్బర్(ఫైల్)

పద్మారావునగర్: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ నేత అక్బర్(58) శుక్రవారం మరణించారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలున్నారు. గత కొంత కాలంగా అస్వస్థతతో బాధపడుతున్న అక్బర్ రైల్ కళారంగ్‌లోని తన నివాసం తెల్లవారుజామున కన్నుమూశారు. అక్బర్ మరణవార్త తెలియగానే పలువురు నాయకులు రైల్ కళారంగ్‌లోని ఆయన నివాసాన్ని సందర్శించి భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు.

అవినీతి లేని దేశమే లక్ష్యం



రాష్ట్ర అధ్యక్షుడికి నియామక పత్రం అందజేస్తున్న

పంజగుట్ట: అవినీతి లేని దేశంను చూడాలన్నదే సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ లక్ష్యమని కమిటీ జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పరిరక్షణ కమిటీ రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా వెంకటేశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎ.ఆంజనేయులు, ప్రధానకార్యదర్శిగా నామా సైదులు, కార్యదర్శిగా జైన శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జంగిటి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజాసమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా గత 15 ఏళ్లుగా కమిటీ పని చేస్తోందన్నారు. ముఖ్యంగా యువతలో చైతన్యం తీసుకువచ్చి, వారిలో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.రాష్ట్రంలో, కేంద్రంలో సమాచార హక్కు చట్టం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే జిల్లా, మండల కమిటీలు ఏర్పాటు చేసి కమిటీని పటిష్టం చేయాలని సూచించారు. సమావేశంలో తరుణ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యూకో బ్యాంక్ వ్యవస్థాపక వేడుకలు



లక్డీకాపూల్ : యూకో బ్యాంక్ 80వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం దేశవ్యాప్తంగా జరుపుకున్న ఈ వేడుకల్లో భాగంగా హైదరాబాద్ జోన్ పరిధిలోని కొత్తగా రెండు బ్యాంక్ శాఖలను అందుబాటులోకి తీసుకువచ్చింది. బోడుప్పల్, జగిత్యాలల్లో ఏర్పాటు చేసిన బ్రాంచ్‌లను బ్యాంక్ జోనల్ మేనేజర్ సందీప్ శర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏజీఎంలు మోతీలాల్, శశిభూషణ్‌రావు, లోకేంద్ర శర్మ పాల్గొన్నారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్ బ్రాంచ్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష ఆదరణ లభించింది. బ్యాంక్ ఉద్యోగులతో పాటు ఖాతాదారులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం



అదృశ్యమైన తల్లీకూతుళ్లు



అడ్డగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన తల్లి, ముగ్గురు కూతుళ్లు అదృశ్యమయ్యారు. ఈ ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవీందర్ తెలిపిన మేరకు.. లాలాపేటలోని యాదవ బస్తీకి చెందిన స్వామి, నాగమణి(36) దంపతులు. వీరికి శ్రీనిధి (13), శ్రీనిజ(13), వినీల(11) ముగ్గురు కూతుళ్లు. ఈ నెల 15న ఇంట్లో భార్య భర్తల మధ్య గొడవ జరిగింది. కాగా, మరుసటి రోజు ఇంట్లో ఎవరూలేని సమయంలో తన ముగ్గురు కూతుళ్లను తీసుకొని నాగమణి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఈ నెల 21న నాగమణి సోదరుడు మధు ప్రకాష్ లాలాపేటకు వచ్చాడు. ఇంట్లో తన సోదరి నాగమణి ముగ్గురు పిల్లలు కనిపించకపోవడంతో తన బావ స్వామిని అడగగా, తనతో గొడవ పడి తన చెల్లెలు సోనీ ఇంటికి వెళ్లిందని చెప్పాడు. దీంతో ప్రకాష్ సోనీని కనుక్కోగా అక్కడికి నాగమణి రాలేదని చెప్పింది. తెలిసిన వారిని, బంధువులను వాకబు చేసినా ఫలితం కనిపించకపోవడంతో శుక్రవారం మధు ప్రకాష్ స్థానిక లాలాగూడ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



స్నేహపరిమళం

ఇండియా-జపాన్ దేశాల మధ్య 70 ఏళ్ల స్నేహానికి అద్దం పడుతోంది ఇకబెనా ఫ్లవర్ అరేంజ్‌మెంట్. 'ఇకబెనా ఇంటర్నేషనల్ హైదరాబాద్ చాప్టర్ 250 శుక్రవారం అమీర్‌పేటలోని ఓ హోటల్‌లో ప్రదర్శన ఏర్పాటు చేసింది. 'యాన్యువల్ ఇకబెనా ఎగ్జిబిషన్–2023'ను పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెన్నైలోని జపాన్ కాన్సులేట్ జనరల్ మిస్టర్ కెన్జీ మియాటా హాజరయ్యారు. ఇకబెనా సిల్వర్‌లైనింగ్ ఎగ్జిబిషన్‌లో హైదరాబాద్‌లోని ఇకబెనా ఆర్టిస్ట్‌లు శారదారెడ్డి, వందనా పాయ్, శివానీ టిబ్రేవాలే, రేవతి మాచర్ల, నీరజ గొడవర్తి, కామేశ్వరి, జయశ్రీ తదితరులు పాతిక మంది ముప్పెక్కి పైగా ఫ్లవర్ అరేంజ్‌మెంట్‌లను ప్రదర్శించారు.

– సాక్షి, సిటీబ్యూరో